క్లుప్తంగా

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

పమిడిముక్కల: తాడంకి గ్రామంలో సచివాలయం వద్ద విజయవాడ సెంటిని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ జంపాన ధనలక్ష్మి తెలిపారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, గుండె, మెదడు, వెన్నెముక, నరాలు, ఎముకలు, జీర్ణకోశ వ్యాధులు, మూత్రపిండాలు, మూత్రకోశ వ్యాధులు, స్త్రీల సంబంధిత సమస్యలపై స్పెషలిస్ట్ వైద్యుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా వైద్యం, సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గుండెకు సంబంధిత పరీక్షలు ఈసీజీ, 2డీ-ఎకో అవసరమైన వారికి ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు.

నేడు మంత్రుల పర్యటన

కైకలూరు: గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, భూగర్భ, గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కైకలూరు ఆదివారం విచ్చేస్తున్నారని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శనివారం విలేకరులకు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు సీఎన్నార్ గార్డెన్ నుంచి మాగంటి థియేటర్ వరకు ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. తాలూకా సెంటర్‌లో నాలుగు గంటలకు రాష్ట్ర చేపల రైతు సంఘ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. 4.30 గంటలకు ఏలూరు రోడ్ సీఎన్నార్ గార్డెన్‌లో మంత్రులు, ఎంపీకి సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

శాకంబరిదేవిగా అమ్మవారు



పమిడిముక్కల: కూడేరు గ్రామంలోని కావూరి వారి ఇలవేల్పు శ్రీ ఆదిలక్ష్మి కామేశ్వరి అమ్మవారు వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ పాలకమండలి పర్యవేక్షణలో కావూరి వంశీయుల సహకారంతో అలంకారాన్ని నిర్వహించారు.

సెలవుదినాలు కచ్చితంగా అమలు చేయాలి



గుడివాడ టౌన్: విద్యా సంస్థల్లో సెలవు దినాలను కచ్చితంగా అమలు చేయాలి ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సమీర్ కోరారు. పట్టణంలోని కార్పొరేట్ కళాశాలలు, విద్యాసంస్థలు తరగతులు నిర్వహించడాన్ని ఆయన తప్పుపట్టారు. కళాశాలల యాజమాన్యంపై ఒత్తిడిని తెచ్చి శనివారం తరగతులకు హాజరైన విద్యార్థులను బయటకు పంపివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను మార్కుల పేరుతో మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థుల మానసిక వికాసం కోసం సంస్థలు పనిచేయాలని స్పష్టంగా తెలిపినా కార్పొరేట్ విద్యాసంస్థలు వాటిని పట్టించుకోవడంలేదన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు, ఇతర అధికారులు సైతం ఈ విషయంలో నిమ్మకునీరెత్తినట్లు ప్రవర్తించడం దారుణమన్నారు. వెంటనే అధికారులు స్పందించి కార్పొరేట్ విద్యాసంస్థలకు హెచ్చరికలు జారీ చేయాలని ఆయన సూచించారు.

భారీ వర్షం.. రైతుల హర్షం



తోట్లవల్లూరు మాగాణి పాలాల్లో చేరిన వర్షం నీరు

తోట్లవల్లూరు: మండలంలో భారీ వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు వర్షం ఎడతెరపి లేకుండా కురవటంతో పల్లపురోడ్లు జలమయమయ్యాయి. మాగాణి పొలాల్లో వర్షం నీరు భారీగా చేరింది. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు వర్షం బాగా ఊరటనిచ్చింది. పొలాల్లో నీరు భారీగా చేరటంతో వరినాట్లు వేగవంతమయ్యే అవకాశం ఏర్పడింది. వరినారు కూడా అదనుకు రావటంతో పొలాలను దమ్ము చేయించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. వర్షం రాకతో వరినాట్ల పనులు ఒక్కసారిగా ఊపందుకున్నట్లయింది. కాగా అంతర్గత రోడ్లు చిత్తడిగా మారటంతోపాటు ప్రధాన రహదారులపై సైతం వర్షం నీరు నిలిచిపోయింది.

మొవ్వలో..

మొవ్వ: ఖరీఫ్ వరి సాగుకు కాలువల ద్వారా నీటిని అందించటంలో ప్రభుత్వం విఫలమైన నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్న రైతులకు శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం వరంలా మారింది. ఈ వర్షం అటు బోర్లు, ఇంజిన్ల ద్వారా వేసిన నారుమడులకు, నాటు వేసిన పొలాలకు.. ఇటు ఎద వేసిన పైరుకి అనుకూలంగా మారింది. అయితే డ్రెయిన్లలో తూటు కూర, గుర్రపు డెక్క పేరుకుపోవటంతో అధికమైన ముంపు నీరు దిగువ ప్రాంతాలకు తరలించలేమని రైతులు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన డ్రెయిన్ల పూడిక తీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా సార్వా వరిసాగుకు సాగునీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. మండల వ్యాప్తంగా 15 వేల ఎకరాల్లో సార్వా వరి సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధిక భాగం నేరుగా విత్తనాలు వెదజల్లు పద్ధతిలో సాగు చేస్తుండగా మరికొంత శాతం నారుమళ్లు పోసి, నాట్లు వేసేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. విత్తనాలు వెదజల్లిన వరిచేలు కొన్ని గ్రామాల్లో మొలకెత్తగా ఆలస్యంగా విత్తనాలు జల్లిన మరికొన్ని గ్రామాల్లో మొలకెత్తాల్సి ఉంది. అదేవిధంగా కొన్ని ప్రాంతాల్లో దమ్ము చేసి నారుమడులు పోయగా మరికొన్ని చోట్ల మెట్ట నారుమళ్లు పోశారు. 20 రోజులుగా వర్షాల కోసం ఎదురుచూస్తుండగా అనుకోని రీతిలో గురువారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల వల్ల సాగు సందడి నెలకొంది. భారీ వర్షాల వల్ల పల్లపు ప్రాంతాలు, గ్రామాల్లోని అంతర్గత రహదారులు జలమయంగా మారాయి. ప్రస్తుత వర్షంతో వరిసాగు పనులు మరింత ముమ్మరంగా చేసుకునేందుకు అవకాశం ఏర్పడిందని రైతులు చెబుతున్నారు.



మొవ్వ మండలంలోని పొలాల్లోకి చేరిన వర్షం నీరు

కలుపు నివారణతో అధిక దిగుబడి



వరి నాట్లు వేస్తున్న కూలీలు

పామర్రు: వరిలో అధిక దిగుబడి సాధించాలంటే కలుపు నివారణ ముఖ్యమని ఏఓ శివనాగరాణి పేర్కొన్నారు. వరి పంటలో పెరిగే కలుపు మొక్కలపై రైతులు జాగ్రత్తగా ఉండాలని లేకుంటే కలుపు తీవ్రతను బట్టి 40 శాతం వరకు దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ వరిలో కలుపు నివారణకు రైతులు చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

పోటీ పడి పెరుగుతాయి

కలుపు మొక్కలు సాధారణంగా గాలి, నీరు, పోషకాలు, వెలుతురు కోసం వరితో పోటీపడి పెరుగుతాయి. దీని ద్వారా వరి ఎదుగుదల తగ్గుతుంది. కలుపు మొక్కలు చీడపీడలకు నిలయంగా మారి వివిధ రకాల తెగుళ్లు, చీడలు వరిని ఆశిస్తాయి.

నివారణ చర్యలు

వరిలో కలుపు నివారణను మొదటి దశలో గుర్తించాలి. తద్వారా పోషకాలు, సహజ వనరులు వరి ఎదుగుదలకు తోడ్పడతాయి. ప్రధానంగా వరి నాటిన నాటి నుంచి నెల రోజుల వరకూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఆక్సాడయిర్జిల్ ఎకరానికి 40 గ్రాముల లేదా ప్రెటిల్లా క్లోర్ 600-800 మిల్లీ లీటర్లు, పైరోజ్ సల్ఫర్ ఇథిల్ ఎనిమిది గ్రాములు, బ్యూటికిర్ 1.5 లీటరును వరి పంట వేసిన 48 గంటలలో 25 కేజీల ఇసుకలో కలిపి చల్లాలి.

గడ్డి, తుంగ నివారణకు

గడ్డి, తుంగ తదితర వెడల్పాటి మొక్కల వల్ల వరిలో తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉంది. వాటిని నివారించేందుకు బిస్ పైరిబాక్ సోడియం 300 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి 25 రోజులలో పిచికారీ చేయాలి. లేకుంటే క్లించర్ 250 మిల్లీ లీటర్లు, విప్ సూపర్ 200 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కలుపు నివారణమందులు వేసే సమయంలో రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. పొలంలో రెండు సెంటీమీటర్ల నీటిని పెట్టుకుని కలుపు మందులను చల్లాలి. నీరుమడిలోనే ఇంకి పోయే విధంగా చూడాలి. కలుపు మందును ఇతర రసాయనాలతో కలిపి వాడకూడదు. ఎప్పుడూ ఒకే రకమైన కలుపు మందును వాడకూడదని ఏఓ తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ టౌన్: తాము అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలలో టూల్ ఆఫ్ చార్జ్, సర్దుబాటు చార్జీలు తగ్గిస్తూ బిల్లులు నియంత్రిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే వాటిని తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం వీటి ద్వారా ప్రజల మీద భారం పెట్టిందని పదే పదే ప్రజలకు చెప్పి నమ్మబలికి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అదనపు చార్జీలన్నీ వెంటనే తగ్గించాలని ఆయన కోరారు. నేడు రైతులకు ఉచిత విద్యుత్ తొలగించడానికి మీటర్లు బిగిస్తున్నారన్నారు. కాబట్టి మీటర్లు పెట్టకుండా నిలుపుదల చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు సమీర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జీవనాన్ని అలవర్చుకోవాలి



రిమ్మనపూడి గ్రామస్తులతో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

రిమ్మనపూడి(పామర్రు): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక జీవనాన్ని అలవర్చుకుంటే గ్రామాలు సస్యశ్యామలంగా మారుతాయని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని రిమ్మనపూడి గ్రామంలోని ఆంజనేస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తి తత్వాన్ని అందరూ నేర్చుకుని గ్రామాల్లో సోదర భావాలను పెంపొందించుకోవాలన్నారు. అప్పుడే గ్రామాలు సుఖ శాంతులతో వర్ధిల్లుతాయన్నారు. గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు వల్లూరిపల్లి గణేష్, ఎన్ఆర్ఐ ఉప్పలపాటి అనీల్ చౌదరి, ఉప్పలపాటి రాజా, మరీదు దుర్గ, జువ్వనపూడి కిరణ్, ఉప్పలపాటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్య పరిష్కారం

పామర్రు: గ్రామంలోని శాలివాహన పేటలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా చొరవతో మురుగునీటి సమస్యను పరిష్కారించారు. వివరాల్లోకి వెళ్తే శనివారం ఎమ్మెల్యే కుమార్‌రాజా బాపూజీపేట మీదుగా శాలివాహన పేటకు వెళ్లారు. ఈ నేపథ్యంలో స్థానికులు కాలనీలో వర్షం నీరు రహదార్లపై నిల్వ ఉంటున్నాయని దీంతో అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే పంచాయతీ అధికారులతో మాట్లాడి మురుగునీరు దిగువకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో పొక్లెయినర్ సాయంతో స్థానిక డ్రెయిన్‌లలోని చెత్తను తొలగించి మురుగునీరు దిగువకుపోయే విధంగా చర్యలు చేపట్టారు. నాయకులు వల్లూరిపల్లి గణేష్, ఆంజనేయులు, చాట్ల రమేష్, ఎన్.కిరణ్‌కుమార్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

18 నుంచి 31వ తేదీ వరకు సర్వే



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సాయిప్రసన్న

తోట్లవల్లూరు: ఈ నెల 18 నుంచి 31వ తేదీ వరకు కుష్టు వ్యాధిపై ఇంటింటా సర్వే నిర్వహించనున్నట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న తెలిపారు. ఈ విషయమై స్థానిక పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో ఆమె శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కుష్టుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా 15 రోజులపాటు జరిగే ఇంటింట సర్వే కార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. వ్యాధి లక్షణాలు కలిగిన వారిని గుర్తించి, అవసరమైన వైద్యం అందించాల్సి ఉంటుందన్నారు. లెప్రసీ నోడల్ సూపర్‌వైజర్ కె.అనిల్‌కుమార్, పీహెచ్ఎన్ పద్మావతి, ఎంపీహెచ్ఎస్ రోహిణి తదితరులు పాల్గొన్నారు.

యోగా.. జీవన విధానంగా మారాలి



కైకలూరు దత్తాశ్రమంలో యోగా శిక్షణలో పాల్గొన్న అభ్యాసీలు

కైకలూరు: నిత్య జీవితంలో యోగా జీవన విధానంగా మారాలని మైసూరు దత్త క్రియా యోగా అంతర్జాతీయ కేంద్ర యోగా గురువులు కామేశ్వరశర్మ, చక్రధారి పేర్కొన్నారు. లోకుమూడిగరువు దత్తాశ్రమంలో మూడు రోజులుగా జరుగుతున్న దత్త క్రియా యోగా శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. దత్తాశ్రమ నిర్వాహకుడు గురజాడ ఉదయశంకర్ ఆధ్వర్యంలో జరిగిన యోగా కార్యక్రమాల్లో చివరి రోజు యోగా గురువులు ప్రాణాయామం, పవన ముక్తాసనం, భుజంగాసనం తదితర ఆసనాలను చేయించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ యోగా వల్ల మానవ శరీరంలో 72 వేల నాడుల్లో ప్రాణశక్తి ప్రవహిస్తుందన్నారు. రోజూ ఉదయమే ఖాళీ కడుపుతో యోగా చేయాలన్నారు. ప్రముఖ డాక్టర్ పుల్లేశ్వరరావు మాట్లాడుతూ నేటి జీవన విధానంలో మధుమేహం వ్యాధిపై ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య వృత్తిలో సైతం రోగులకు ప్రాణాయామం చేయాలని సూచిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ గుండెపోటు నుంచి ప్రాణాలు రక్షించడానికి సీపీఆర్ పద్ధతిని నేర్చుకోవాలని సూచించారు. అనంతరం ఉచిత శిక్షణ తరగతులు చెప్పిన యోగా గురువులను సన్మానించారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

పమిడిముక్కల: మారుతున్న కాలానుగునంగా టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా బైక్ మెకానిక్‌లకు సూచించారు. శ్రమశక్తి జిల్లా టూ వీలర్స్ మెకానిక్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీరంకిలాకు శ్రీనివాస కల్యాణ మండపంలో బైక్ మెకానిక్‌లకు బీఎస్-6 బైక్‌లపై శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మెకానిక్‌లకు శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. మెకానిక్‌లకు ఎటువంటి సమస్యలున్నా తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ అక్బర్ బాషా మాట్లాడుతూ బీఎస్-6 బైక్‌లపై అవగాహన లేక మెకానిక్‌లు ఇబ్బందులు పడుతున్నారని, అసోసియేషన్ తరపున శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసోసియేషన్ జిల్లా నాయకులు పీఎస్ ఖాన్, ఎం.జగన్నాథం, ఆముదాలపల్లి గోపాలకృష్ణ, రామాంజనేయులు, శ్రీనివాసరావు, రవికుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుడు ఇబ్రహీం మృతి



గుడివాడ టౌన్: బేతవోలు మున్సిపల్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న షేక్ ఇబ్రహీం(49) శనివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. 2000వ సంవత్సరంలో సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయుడిగా పురపాలక సంఘ పాఠశాలలో చేరిన ఆయన తెలుగు పండిట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ప్రస్తుతం ఇబ్రహీం ఎస్టీయూ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. శనివారం ఉదయం ఆయన గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. షేక్ ఇబ్రహీంకు భార్య, కుమారుడు ఉన్నారు. ఇబ్రహీం మృతిపట్ల ఎస్టీయూ జిల్లా, పట్టణ శాఖల అధ్యక్ష కార్యదర్శులు, ఉపాధ్యాయులు సంతాపాన్ని తెలిపారు.

16, 17 తేదీల్లో చాగంటి ప్రవచనాలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలో ఈ నెల 16, 17 తేదీల్లో డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు హిందూ ఐక్య వేదిక ప్రతినిధులు శనివారం తెలిపారు. స్థానిక మెహర్‌బాబా ఆడిటోరియంలో ప్రవచన కార్యక్రమ కరపత్రాన్ని వేదిక ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని మూడు స్తంభాల సెంటరు సమీపంలో ఉన్న గోల్డ్ కన్వెన్షన్ హాల్లో సాయంత్రం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. నిత్యపూజా విధానం అంశంపై చాగంటి కోటేశ్వరరావు అనుగ్రహణభాషణం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎంవీ బాబా ప్రసాద్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా మాజీ చైర్మన్ మామిడి మురళీకృష్ణ, రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ దేసు సుబ్రహ్మణ్యేశ్వరరావు, వేముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ

- ఆక్రమణలతో కుచించుకుపోయిన డ్రెయిన్లు
- చిన్నపాటి వర్షానికే రహదారులు జలమయం

కైకలూరు: కైకలూరులో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. ముఖ్యంగా కలుషిత తాగునీరు, అస్తవ్యస్త డ్రెయిన్ల వల్ల సమస్య తీవ్రమవుతోంది. చిన్న పాటి వర్షం కురిస్తే రహదారులపై మురుగునీరు చేరుతోంది. ప్రజా ప్రతినిధులు అధికారులపై, అధికారులు ఇతరులపై నెపం వేసి పబ్బం గుడుపుతున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మరో వైపు కొంతమంది డ్రెయిన్లను ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేస్తున్నారు. పంచాయతీ అధికారులు ప్రశ్నిస్తే రాజకీయ నాయకుల పేర్లు చెప్పి బెదిరిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

కైకలూరు పంచాయతీలో 20 వార్డులు ఉన్నాయి. దాదాపు 38 వేల జనాభా, 15,000 మంది ఓటర్లు ఉన్నారు. ఏడాది వివిధ పన్నుల రూపేణ పంచాయతీకి రూ.2 కోట్ల 25లక్షల ఆదాయం వస్తోంది. ఆక్వా సంబంధిత వృత్తి పనులపై ఇక్కడ జనాభా ఆధారపడి జీవిస్తున్నారు. నియోజకవర్గ ప్రధాన కేంద్రం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి వివిధ శాఖల ఉద్యోగస్తులు నివసిస్తున్నారు. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా వసతుల కల్పన జరగడం లేదు. ఇప్పటి వరకు పంచాయతీ డంపింగ్ యార్డుకు స్థల సేకరణ సైతం జరగలేదు. దీంతో ఏలూరు రోడ్‌లో చెత్తను వేస్తున్నారు.

అస్తవ్యస్తం

కైకలూరు పంచాయతీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పంచాయతీలో 20 వార్డుల్లో రోజు వారి వాడకపు నీరు రాళ్లకోడు, శ్యాంప్ డ్రెయిన్, సంగన్నకోడు, పుల్లవ డ్రెయిన్లకు చేరుతోంది. రాళ్లకోడులో అనేక ప్రాంతాల్లో ఆక్రమణలు జరగడం వల్ల నీరు సవ్యంగా పారడం లేదు. ఎంపీ యూపీ స్కూల్ వెనుక డ్రెయిన్ పూడుకుపోయింది. ఇక ప్రధానంగా వెలంపేటలో మురుగునీరు రైల్వే ట్రాక్ దాటి పుల్లవ డ్రెయిన్‌లో కలవాల్సి ఉంది. ఇటీవల రైల్వే డబుల్ ట్రాక్ నిర్మించారు. దీంతో ఖానాలు పూడుకుపోయి మురుగునీరు వెళ్లడం లేదు. పంచాయతీ సిబ్బంది ప్రతిసారీ మోటార్లతో నీటిని తోడుతోన్నారు. డ్రెయిన్లలో క్యారీ బ్యాగులు చెత్తను పడేయడంతో అవి పేరుకుపోయి నీరు దిగువకు వెళ్లడం లేదు.

ఆక్రమణలే అసలు కారణం

డ్రెయినేజీ వ్యవస్థ నిర్వీర్యం కావడానికి ప్రధాన కారణం ఆక్రమణలని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో పంచాయతీ సమస్యలపై చర్చించినప్పుడు ఇదే విషయాన్ని పలువురు లేవనెత్తారు. ప్రధానంగా ఏలూరు రోడ్ నుంచి మాగంటి థియేటర్ సెంటర్ వరకు జాతీయ రహదారికి ఇరువైపుల దుకాణదారులు డ్రెయిన్లను ఆక్రమించారు. రైతు బజారు సమీపంలో హోటళ్ల అడుగుభాగంలో డ్రెయిన్లు ఉన్నాయి. అదేవిధంగా తాలూకా సెంటర్‌లో రెండు హోటళ్లు రోజూ నీరు, చెత్తను డ్రెయిన్లలో పడేస్తున్నారు. అడవినాయుడు సెంటర్‌లో పలు దుకాణాలు పూర్తిగా డ్రెయిన్లను ఆక్రమించారు. దుకాణాల్లో వస్తువులను ప్రదర్శనగా ఉంచడానికి డ్రెయిన్లపై శాశ్వత కట్టడాలు కట్టడం వల్ల వాటిలో పేరుకుపోయిన మట్టిని తీయడం కూడా కష్టతరమవుతోంది.



కైకలూరు జాతీయ రహదారిపై డ్రెయిన్‌ను ఆక్రమించి నిర్మించిన మెట్లు



కైకలూరులో పూడిక తీయడానికి ఇబ్బంది పడుతున్న పారిశుధ్య కార్మికులు



వెలంపేటలో డ్రెయినేజీ నీటి పారుదల లేకపోవడంతో నిలిచిన నీరు



కైకలూరు జాతీయ రహదారిపై చొచ్చుకు వచ్చిన శాశ్వత కట్టడం




కైకలూరు సంతమార్కెట్ సమీపంలో ఆక్రమణల వల్ల పొంగుతున్న డ్రెయిన్

సమస్య పరిష్కరిస్తాం

కైకలూరులోని డ్రెయినేజీలలో పారుదల సమస్య ఉండటం వాస్తవమే. పంచాయతీ సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు పూడిక తీయిస్తున్నాం. కొన్ని వీధుల్లో డ్రెయిన్లను ఆక్రమించుకోవడంతో నీరు స్తంభిస్తోంది. వెలంపేటలో వర్షం నీటిని బయటకు పంపడానికి మోటార్లు ఉపయోగిస్తున్నాం. డ్రెయిన్ల మరమ్మతులపై ప్రజాప్రతినిధుల సూచనలలో ప్రణాళిక రూపొందిస్తాం.

– ఆదిరాజు వెంకటేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ

ఆక్రమణలు తొలగిస్తేనే..



పంచాయతీ డ్రెయిన్లు ఆక్రమించి కట్టడాలు నిర్మించడం సమస్య తీవ్రతరంగా మారింది. పంచాయతీ ప్లాన్‌లో చూపించిన విధంగా కట్టడాలు చాలామంది కట్టలేదు. కొంతమంది డ్రెయిన్లను ఆక్రమిస్తున్నారు. ఇలాంటి వాటిని తొలగిస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. పూర్తి స్థాయిలో డ్రెయినేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి.

– ఎండీ.గాలిబ్‌బాబు, 12వ వార్డు సభ్యుడు, కైకలూరు

భుజబలపట్నంలో పారిశుధ్య పనులు



కైకలూరు: అధికారుల ఆదేశాలతో భుజబలపట్నం గ్రామంలో జాతీయ రహదారి సమీప చెత్త, డ్రెయిన్లకు మరమ్మతులు చేయిస్తున్నామని పంచాయతీ సెక్రటరీ మేక రవికిరణ్ శనివారం విలేకరులకు తెలిపారు. గ్రామంలో పొక్లెయిన్‌తో పనులు చేయించినట్లు పేర్కొన్నా. మూడు రోజులు పాటు ఇవి కొనసాగుతాయన్నారు. ఇటీవల రహదారి విస్తరణ పనుల్లో సమీప డ్రెయిన్లు మట్టితో పూడుకుపోయాయన్నారు. అదేవిధంగా రోడ్డు సమీపంలో గ్రామంలో చెత్తను పడేశారన్నారు. వీటిని తొలగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు గురజాల వేణు, పెన్మత్స త్రినాథరాజు, డిజిటల్ అసిస్టెంట్ నబిగారి నాగ సాయితేజ పాల్గొన్నారు.